సాక్షి విజయనగరం

ఆదివారం । 3 । నవంబర్ । 2024



గాడి తప్పిన గ్రామ స్వరాజ్యం

టీడీపీ కూటమి పాలనలో సచివాలయం, ఆర్‌బీకేల సేవలు అందని ద్రాక్షగా మారాయి. ప్రజలకు ఆవేదన మిగుల్చుతున్నాయి. - 8లో



అగ్ని ప్రమాదంలో దగ్ధమైన దుకాణాలు

భామిని మండల కేంద్రంలో శనివారం రాత్రి సంభవించిన అగ్ని ప్రమాదంలో మూడు దుకాణాలు కాలిబూడిదయ్యాయి. - 8లో



చి'వరి'లో ఇదేం తీరు..!

ఆరుగాలం శ్రమించి అందరికీ అన్నంపెట్టే రైతన్నకు అండగా ఉండాల్సిన మడ్డువలస ప్రాజెక్టు అధికారులు... ఆవేదనకు గురిచేస్తున్నారు. - 8లో

న్యూస్‌రీల్

ఎన్నికల కోడ్ అమలుతో గ్రీవెన్స్‌సెల్ రద్దు

విజయనగరం క్రైమ్: జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడం, ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఈ నెల 4వ తేదీ సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించాల్సిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్టు ఎస్పీ వకుల్ జిందాల్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు, అర్జీదారులు ఈ విషయాన్ని గ్రహించాలని కోరారు.

అమల్లోకి ఎన్నికల కోడ్



కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్

విజయనగరం అర్బన్: స్థానిక సంస్థల శాసన మండలి స్థానానికి ఎన్నికల షెడ్యూల్ వెలువడడంతో జిల్లాలో శనివారం నుంచి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిందని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు. ప్రతి ఒక్కరూ విధిగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటించాలని ఆదేశించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు తదితర కార్యక్రమాలు చేయరాదని, ఓటర్లను ప్రలోభపెట్టే ఎటువంటి పనులు చేయకూడదని స్పష్టం చేశారు. రాష్ట్ర, కేంద్ర మంత్రులు తమ పర్యటనల సందర్భంగా ఎన్నికల నియమావళిని కచ్చితంగా అమలు చేయాలన్నారు. ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటించాలని ఆదేశించారు.

సీఎం పర్యటన రద్దు

గజపతినగరం: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌తో జిల్లాలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటన రద్దయింది. గజపతినగరం మండలం పురిటిపెంట గ్రామంలో రోడ్ల మరమ్మతుల పనులను ఆయన శనివారం ప్రారంభించాల్సి ఉంది. ఈ మేరకు జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా ఏర్పాట్లు పూర్తిచేశారు. ఎన్నికల కోడ్ శుక్రవారం రాత్రి విడుదల కావడంతో పర్యటన రద్దయింది. సీఎం పర్యటన ఏర్పాట్లకు లక్షల్లో ఖర్చుచేశామని, చివరకు రద్దయిందంటూ టీడీపీ నాయకులు తమ అనుచరుల వద్ద వాపోతున్నారు.



ఆపదలో ఉన్నవారికి రక్తం కావాలంటే.. తక్కున గుర్తొచ్చేది విజయనగరానికి చేరువలో ఉన్న జరజాపుపేట.. అక్కడ ఉన్న సాధన యువజన సంఘం సభ్యులు. ఆపద సమయాన రక్తందానం చేసి ఆదుకోవడం వారి నైజం. కళ్లముందే రక్తం అందక తోటి విద్యార్థి మృతిని తట్టుకోలేని విద్యార్థులు... సుమారు 16 ఏళ్లుగా ఓ సంఘంగా ఏర్పడి రక్తదాన యజ్ఞాన్ని నిర్విఘ్నంగా సాగిస్తున్నారు. గ్రామాన్ని రక్తదాతలకు కేరాఫ్‌గా మార్చారు. ఆ గ్రామ యువత సేవలను కేంద్ర ప్రభుత్వం మెచ్చింది. అవార్డుతో సత్కరించింది. రక్తదానం చేసి ప్రాణాలు నిలపడంలో వారు చేస్తున్న 'సాధన'కు 'సాక్షి' అక్షరరూపం.

జరజాపుపేట... రక్తదాతల కోట

సేవా మార్గం



రక్తదాన కార్యక్రమంలో పాల్గొన్న దుర్గాప్రసాద్, సోదరుడు ఆనంద్, తండ్రి నారాయణరావు

ఆపద్బాంధవులు

- సేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్న జరజాపుపేట యువత
- రక్తదానంతో ఆదుకుంటున్న సాధన యువజన సంఘం సభ్యులు
- వారి సేవలకు జాతీయ స్థాయిలో గుర్తింపు

సండే స్పెషల్

నెల్లిమర్ల: ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేయడం ప్రాణదానంతో సమానం. అటువంటి రక్తదాన కార్యక్రమాన్ని నెల్లిమర్ల నగరపంచాయతీ పరిధిలోని జరజాపుపేటకు చెందిన యువత ఒక యజ్ఞంలా సాగిస్తున్నారు. విద్యార్థులు, ఉద్యోగులు, యువత సాధన యువజన సంఘంగా ఏర్పడి నిరంతరం రక్తదాన శిబిరాలు నిర్వహిస్తూ జిల్లాలో రక్తం కొరతను తీర్చడంలో తమదైన భూమిక పోషిస్తున్నారు. ఆపద సమయాన నేరుగా బ్లడ్‌బ్యాంకుకు వెళ్లి రక్తం దానం చేస్తూ వందలాదిమందికి ప్రాణదానం చేస్తున్నారు. రక్తదానం చేయడం ఒక అదృష్టంగా భావిస్తూ అందరితో ప్రశంసలు అందుకుంటున్నారు.



రాజస్థాన్ రాష్ట్రం జైపూర్‌లో ఇటీవల కేంద్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి అతుల్‌గోయల్ చేతుల మీదుగా జాతీయ పురస్కారం అందుకుంటున్న సాధన యువజన సంఘం అధ్యక్షుడు దుర్గాప్రసాద్

తోటి విద్యార్థి మరణంతో రక్తదానానికి అంకురార్పణ..

జరజాపుపేట ఉన్నత పాఠశాలలో 2007–08 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థి రాచర్ల సురేష్ రక్తం దొరకక బ్లడ్ కాన్సర్‌తో మృతిచెందాడు. ఈ ఘటన మిగిలిన విద్యార్థులను కదిలించింది. ఇక నుంచి ఎవరూ రక్తం కొరతతో చనిపోకూడదని నిర్ణయానికి వచ్చారు. రక్తదాన కార్యక్రమానికి అంకురార్పణ చేశారు. 60 మందితో సాధన యువజన సంఘాన్ని ఏర్పాటుచేసి 2008 ఫిబ్రవరి 17న తాలిసారి గ్రామంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. నేటికి సుమారు 200 శిబిరాలు నిర్వహించి వేలాది యూనిట్ల రక్తం దానం చేశారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకున్నారు. 60 మందితో ఏర్పడిన సాధన యువజన సంఘం సభ్యుల సంఖ్య ప్రస్తుతం 500 దాటింది. రక్తదానం ఓ క్రతువుగా సాగుతోంది.

విద్యాభివృద్ధికి ప్రోత్సాహం



రక్తదానంతో పాటుగా పర్యావరణ పరిరక్షణ, విద్య, ఆరోగ్యం, సృజనాత్మకత తదితర అంశాల్లో యువతలో చైతన్యం నింపుతున్నాం. చదువుతోనే భవిత మారుతుందన్న ఉద్దేశంతో గ్రంథాలయాల ఏర్పాటును ప్రోత్సహిస్తున్నాం. పలు గ్రామాల గ్రంథాలయాలు, పాఠశాలలకు పుస్తకాలు సమకూర్చుతున్నాం. మా గ్రామ ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో 2020లో సొంతనిధులతో మహాత్మాగాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేశాం. ఇప్పటి వరకు 42 సార్లు రక్తదానం చేశాను.

– పసుమర్తి వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి, సాధన యువజన సంఘం జరజాపుపేట

అదృష్టంగా భావిస్తున్నాం



రక్తదానం చేయడం మా సాధన సంఘ సభ్యులందరూ అదృష్టంగా భావిస్తారు. అందుకే.. 60 మందితో ఏర్పడిన సంఘ సభ్యుల సంఖ్య 500కు చేరింది. మా కుటుంబ సభ్యులతో పాటు యువతను రక్తదానానికి ప్రోత్సహిస్తాం. ఇప్పటి వరకు 16 సార్లు రక్తదానం చేశాను.

– పోలుబోతు ఆనంద్, సంఘం సభ్యుడు, జరజాపుపేట

ఏ సమయంలోనైనా..



ఎవరికి ఏ సమయంలో రక్తం అవసరమైనా సరే మేమంతా వెంటనే స్పందించి వారికి కావాల్సిన రక్తాన్ని అందిస్తాం. అందువల్ల ఎంతో మంది ప్రాణాలు కాపాడగలిగాం. అది మా అదృష్టంగా భావిస్తాం. బ్లడ్, ఐ క్యాంపులు అనేక సార్లు నిర్వహించాం. ఇప్పటివరకు 47 సార్లు రక్తదానం చేశాను.

– అవనాపు జీవన్‌రావు, సంఘ సభ్యుడు, జరజాపుపేట

మాది అంతా రక్తదాతల కుటుంబం



ఉద్యోగ రీత్యా ప్రైవేటు, ప్రభుత్వ సంస్థల్లో ఎక్కడ పని చేస్తున్నా... అందరం రక్తదాన శిబిరాలకు క్రమం తప్పకుండా హాజరవుతుంటాం. మాది అంతా ఓ రక్తదాతల కుటుంబం. కలిసిమెలసి మెలగుతాం. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలన్నదే మా 'సాధన' లక్ష్యం. వేసవి కాలంలో చలివేంద్రాలు విరివిగా ఏర్పాటుచేసి పాదచారుల దాహార్తి తీర్చుతున్నాం. ఇప్పటి వరకు 35 సార్లు రక్తదానం చేశాను.

– మద్దిల రాంబాబు, సంఘం సభ్యుడు, జరజాపుపేట

63 సార్లు రక్తదానం



18 ఏళ్ల వయస్సు నుంచి రక్తదానం చేస్తున్నా. ఇప్పటి వరకు 63 సార్లు రక్తదానం చేశాను. గర్భిణులు, క్షతగాత్రులు, తలసేమియా, సికిల్ సెల్ ఎనీమియా బాధితులకు, గుండె ఆపరేషన్లకు, డెంగీ పేషెంట్లకు, క్యాన్సర్ రోగులకు తక్షణమే బ్లడ్ అందించేందుకు సంస్థను స్థాపించాం. అదే లక్ష్యంగా మా సంఘం నిరంతరం సేవలందిస్తోంది.

– పి.దుర్గాప్రసాద్, అధ్యక్షుడు, సాధన యువజన సంఘం, జరజాపుపేట

సేవల్లో మేటి

సంఘ సభ్యులు రక్తదాన కార్యక్రమాలతో పాటు ఉచితంగా నేత వైద్యశిబిరాలు, చలివేంద్రాల నిర్వహణ, వద్ధాశ్రమాలకు ఆహారం అందజేయడం, గ్రంథాలయాలకు పుస్తకాల పంపిణీ, పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఏటా మట్టి వినాయక ప్రతిమల పంపిణీ, జాతీయ నాయకులు, సంఘం సభ్యుల పుట్టినరోజు, పెళ్లిరోజు కార్యక్రమాలను పురస్కరించుకుని మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలతో సమాజానికి తమవంతు సేవలందిస్తున్నారు. వీరి సేవలకు మెచ్చి తెలంగాణ రాష్ట్రంలో వరంగల్‌కు చెందిన కన్నతల్లి ఫౌండేషన్ సంస్థ సంక్రాంతి జాతీయపురస్కారాన్ని ఈ ఏడాది జనవరిలో అందజేసింది. రాజస్థాన్ రాష్ట్రం జైపూర్‌లో ఇటీవల నిర్వహించిన జాతీయ రక్తదాన దినోత్సవంలో కేంద్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి డాక్టర్ అతుల్ గోయల్ సాధన సంఘానికి అవార్డును ప్రదానం చేశారు. సంఘ అధ్యక్షుడు పోలుబోతు దుర్గాప్రసాద్ ఇటీవల అవార్డును అందుకున్నారు.



రక్తదాన శిబిరంలో గ్రామ యువత, పెద్దలు (ఫైల్)

మోగిన ఎమ్మెల్సీ ఉపఎన్నిక నగారా

- రఘురాజుపై వేటుతో ఖాళీ అయిన సీటు భర్తీకి ఎన్నిక
- షెడ్యూల్‌ను విడుదల చేసిన ఎన్నికల కమిషన్
- 4న ఎన్నికల నోటిఫికేషన్‌తో హడావిడి మొదలు
- నామినేషన్ల దాఖలుకు 11వ తేదీ వరకూ గడువు
- 28వ తేదీన పోలింగ్
- డిసెంబర్ 1న ఓట్ల కౌంటింగ్
- అమల్లోకి వచ్చిన ఎన్నికల నియమావళి

'స్థానిక' బలబలాలు ఇలా.... (నోట్: పార్టీ గుర్తుపై గెలిచిన అభ్యర్థులు)

ఓటర్లు	మొత్తం	వైఎస్సార్‌సీపీ	టీడీపీ	ఇండిపెండెంట్	జనసేన	కాంగ్రెస్	ఖాళీలు
ఎంపీటీసీలు	549	431	85	13	0	0	20
జెడ్పీటీసీలు	34	33	0	0	0	0	1
విజయనగరం కార్పొరేటర్లు	50	48	2	0	0	0	0
సాలూరు మున్సిపాలిటీ	29	21	5	2	0	1	0
బొబ్బిలి మున్సిపాలిటీ	31	21	9	0	0	0	1
పార్వతీపురం మున్సిపాలిటీ	30	24	6	0	0	0	0
నెల్లిమర్ల నగర పంచాయతీ	20	13	7	0	0	0	0
ఎమ్మెల్యేలు	9	0	8	0	1	0	0
ఎమ్మెల్సీ	1	1	0	0	0	0	0
మొత్తం	753	592	122	15	1	1	22

సాక్షి ప్రతినిధి, విజయనగరం: పదవిని కట్టబెట్టిన వైఎస్సార్‌సీపీకే రాజకీయ ద్రోహం చేసిన ఇందుకూరి రఘురాజుకు ఎమ్మెల్సీ పదవి కాస్తా మూణ్నాళ్ల ముచ్చటే అయ్యింది. పార్టీ నియమావళిని ఉల్లంఘిస్తూ టీడీపీతో అంటకాగిన ఆయన చివరకు ఎమ్మెల్సీ పదవినే కోల్పోవాల్సి వచ్చింది. శాసన మండలి చైర్మన్ మోషేన్ రాజు ఆయనపై వేటు వేశారు. దీంతో స్థానిక సంస్థల కోటాలోని విజయనగరం జిల్లా ఎమ్మెల్సీ సీటు ఖాళీ అయ్యింది. ఈ స్థానాన్ని భర్తీ చేయడానికి కేంద్ర ఎన్నికల సంఘం శుక్రవారం షెడ్యూల్ విడుదల చేసింది. 4వ తేదీ సోమవారం ఎన్నికల ప్రకటన రానుంది. ఆ రోజు నుంచి 11వ తేదీలోగా నామినేషన్లు దాఖలు చేయాల్సి ఉంటుంది. ఈనెల 28వ తేదీ గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ఓట్ల పోలింగ్ జరుగుతుంది. డిసెంబర్ 1వ తేదీన ఓట్ల లెక్కింపు ఉంటుంది. షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చింది. ఇది డిసెంబర్ 2న ఎన్నికల ప్రక్రియ ముగిసేవరకూ అమల్లో ఉంటుంది.

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే తగు స్థానం కల్పిస్తానని 2018 పాదయాత్ర సమయంలో వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం శృంగవరపుకోటకు చెందిన ఇందుకూరి రఘురాజును స్థానిక సంస్థల కోటాలో శాసనమండలికి పంపించారు. వాస్తవానికి 2027 డిసెంబర్ 1వ తేదీ వరకూ ఆయనకు పదవీకాలం ఉంది. కానీ సార్వత్రిక ఎన్నికలకు ముందు ప్రత్యర్థి పార్టీతో చేతులు కలిపి సొంత పార్టీకి వ్యతిరేకంగా పనిచేస్తున్నారనే ఫిర్యాదుతో పదవినే కోల్పోవాల్సి వచ్చింది. నారా లోకేశ్ సహా టీడీపీ నాయకులతో అంటకాగుతున్న వ్యవహారం ఒక్కటే కాదు వారితో కుమ్మక్కై ఎస్.కోట అసెంబ్లీ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కడుబండి శ్రీనివాసరావు, విశాఖ లోక్‌సభ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మికి వ్యతిరేకంగా పనిచేస్తున్నట్లు ఆధారాలతో శాసనమండలిలో వైఎస్సార్‌సీపీ విప్ పాలవలస విక్రాంత్ ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపిన మండలి చైర్మన్ మోషేన్ రాజు రఘురాజుపై వేటువేస్తూ జూన్ 3న నిర్ణయం వెలువరించారు.

పదవులిచ్చిన పార్టీకే ద్రోహం...

గత సార్వత్రిక ఎన్నికల సమయంలో ఎస్.కోట టీడీపీ టికెట్ విషయమై కోళ్ల లలితకుమారికి, ఆమెకు వ్యతిరేకంగా గళమెత్తిన గొంప కృష్ణకు మధ్య హైదరాబాద్‌లోని నారా లోకేశ్ నివాసంలో జరిగిన పంచాయితీకి ఇందుకూరి రఘురాజు రహస్యంగా వెళ్లడం అప్పట్లో సంచలనమైంది. ఎస్.కోట వైస్ ఎంపీపీ పదవికి రాజీనామా చేయకుండానే ఆయన భార్య ఇందుకూరి సుబ్బలక్ష్మి అలియాస్ సుధారాజు వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. లోకేశ్‌తో పచ్చ కండువా వేయించారు. బడ్డువరలోని స్వగృహంలో టీడీపీ సమావేశాలన్నీ పెడుతూనే అవేవీ తనకు సంబంధం లేదని బుకాయిస్తూ వచ్చారు. వాస్తవానికి పార్టీకి నష్టం కలిగించే పనులు చేయొద్దని రఘురాజు దంపతులకు వైఎస్సార్‌సీపీ అధిష్టానం ఎంత వారించినా 'స్థానికత' ముసుగులో పార్టీకి ద్రోహం చేయడానికి తెగించారు. ప్రజాప్రాతినిధ్య చట్టం–1951 ప్రకారం ఒక పార్టీ తరఫున చట్టసభల్లో అడుగుపెట్టిన వ్యక్తి తర్వాత సదరు పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం–1985 ప్రకారం అనర్హత వేటు పడుతుంది. ఈ ప్రకారం వైఎస్సార్‌సీపీ నుంచి ఎమ్మెల్సీగా శాసనమండలిలో అడుగుపెట్టిన రఘురాజు ఇప్పుడు పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారని రుజువవ్వడంతో పదవి రద్దు అయిపోయింది.



ఎమ్మెల్సీ ఉప ఎన్నిక షెడ్యూల్ ఇలా...

నోటిఫికేషన్ జారీ	: నవంబర్ 4
నామినేషన్లకు గడువు	: నవంబర్ 11
నామినేషన్ల పరిశీలన	: నవంబర్ 12
నామినేషన్ల ఉపసంహరణ గడువు	: నవంబర్ 14
పోలింగ్	: నవంబర్ 28 (గురువారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ)
ఓట్ల లెక్కింపు	: డిసెంబర్ 1
ఎన్నికల ప్రక్రియ పూర్తి	: డిసెంబర్ 2

తిరుగులేని ఆధిక్యంలో వైఎస్సార్‌సీపీ...

ఉమ్మడి విజయనగరం జిల్లాలో శాసనమండలి స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీ ఉప ఎన్నికలోనూ వైఎస్సార్‌సీపీ విజయం నల్లేరుపై నడకే. పార్టీ గుర్తుపై పోటీచేసిన ఎంపీటీసీలు, జెడ్పీటీసీలతో పాటు విజయనగరం నగరపాలక సంస్థ కార్పొరేటర్లు, బొబ్బిలి, పార్వతీపురం, సాలూరు మున్సిపాలిటీలు, నెల్లిమర్ల నగర పంచాయతీ కౌన్సిలర్లు ఓటర్లుగా ఉంటారు. జిల్లాలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కూడా ఓటుహక్కు ఉంది. ఈ ప్రకారం మొత్తం 753 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 592 మంది వైఎస్సార్‌సీపీ వారే. టీడీపీ బలం 122 కాగా, జనసేనకు ఒకటి మాత్రమే ఉంది. ఇండిపెండెంట్లు 15 మంది ఉన్నారు. మరణాల వల్ల 22 స్థానాలు ఖాళీగా ఉన్నాయి.

ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు



తమరాం వద్ద ఇసుకరీచ్‌లో పొక్లెయిన్‌తో తవ్వకాలు

- తమరాం ఇసుకరీచ్ వద్ద కాసుల దందా
- ఒక్కో ట్రాక్టర్‌కు రూ.2 వేలు వరకూ వసూలు
- సంతకవిటి మండల టీడీపీ నేతదే హవా!
- నిబంధనలకు విరుద్ధంగా పొక్లెయిన్‌తో తవ్వకాలు
- నదికి అడ్డంగా గ్రావెల్ గట్లు

రాజాం/సంతకవిటి: టీడీపీ కూటమి నేతలు ఇసుక దోపిడీకి బార్లీ తలుపులు తెరిచారు. ఓ వైపు ఉచితం అంటూ మరో వైపు ఇసుక అక్రమ వ్యాపారం యథేచ్ఛగా సాగిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పొక్లెయిన్‌తో తవ్వకాలు చేస్తూ.. రాత్రిపూట లారీలు, ట్రాక్టర్లకు లోడ్ చేస్తున్నారు. రూ.వేలల్లో వసూలు చేస్తూ కాసుల దందా కొనసాగిస్తున్నారు. అధికార బలంతో చేస్తున్న ఇసుక అక్రమ వ్యాపారాన్ని ప్రశ్నించలేక అటు ప్రజలు, ఇటు అధికారులు మౌనందాల్చుతున్నారు. అధికార పార్టీ నేతల ఇసుక అక్రమ వ్యాపారానికి నాగావళి నదిలో సంతకవిటి మండలం తమరాం వద్ద నిర్వహిస్తున్న ఇసుక రీచ్ నిలువెత్తు సాక్ష్యంగా మారింది.

అక్రమ వసూళ్లు..

సంతకవిటి మండలం తమరాం గ్రామం వద్ద నాగావళి నదిలో ఇసుకరీచ్‌ను కూటమి ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ ప్రాంతంలో 3.24 హెక్టార్లలో 32,393 క్యూబిక్ మీటర్లు ఇసుకను తీసుకునేందుకు అనుమతులిస్తూ టెండర్లు వేసింది. ఈ టెండర్లు హైదరాబాద్‌కు చెందిన ఓ సంస్థ దక్కించుకోగా, అక్కడి నుంచి సబ్‌కాంట్రాక్ట్ పేరుతో గుంటూరుకు చెందిన కూటమి నేత మన్నావ్ మైన్స్ అండ్ మినరల్ ఏజెన్సీ ఇసుక తవ్వకాలను పర్యవేక్షిస్తోంది. ఇందులో సంతకవిటి మండలానికి చెందిన ఓ టీడీపీ నాయకుడు కీలక పాత్ర పోషిస్తూ రీచ్ నిర్వహణ అంతాతానై చేస్తున్నాడు. అధికారులు ఉచితంగా ఇసుక తవ్వకోవాలని సూచించినా.. రీచ్ ఉన్న ప్రాంతం వద్ద టీడీపీ కార్యకర్త తన అనుచరులను నియమించి ఒక్కో ట్రాక్టర్ వద్ద ఆరంభంలో రూ.1000లు వసూలు చేసేవారు. ఇందులో రూ. 400లు స్థలం అద్దె, మరో రూ. 600లు కూలి ఖర్చులు లెక్కన దందా ప్రారంభించారు. ప్రతిరోజు 120 నుంచి 150కిపైగా ట్రాక్టర్లు వస్తుండడంతో ఈ వసూళ్లు ఇప్పుడు రెట్టింపుచేశారు. ఒక్కో ట్రాక్టర్ వద్ద రూ. 2వేలు వసూలు చేస్తున్నారు. టీడీపీ కార్యకర్తలకు చెందిన ట్రాక్టర్ల వద్ద రూ.1000 నుంచి రూ.1500లు వసూలు చేస్తున్నారు. ఇతర వ్యక్తుల వద్ద రూ. 2వేలు వసూలుచేస్తూ రోజుకు 24లక్షల వరకు అక్రమ వసూలు చేస్తున్నట్టు సమాచారం. ఇందులో రాజాం నియోజకవర్గ ప్రజాప్రతినిధికి 50 శాతం, రెవెన్యూ అధికారులకు 15 శాతం, మైనింగ్ అధికారులకు 15 శాతం, మిగిలినది ర్యాంప్ నిర్వహణకు ఖర్చుచేస్తున్నట్టు బహిరంగంగా చెబుతుండడం గమనార్హం.



హద్దులు దాటి ట్రాక్టర్లకు ఇసుక లోడింగ్

నిబంధనలకు విరుద్ధంగా..

ఇక్కడ ఇసుక రీచ్ పోతులజగ్గుపేట వద్ద ఉన్న వంతెనకు కూతవేటు దూరంలో ఉంది. ఇసుక రీచ్‌ను కూడా ఉత్తర, దక్షిణ దిక్కులకు ఎక్కువ విస్తీర్ణాన్ని కేటాయిస్తూ కేవలం 3.24 హెక్టార్లలో మాత్రమే తవ్వేందుకు మైనింగ్ శాఖ అనుమతిచ్చింది. నిబంధనల ప్రకారం నదిలో ఎటువంటి యంత్రాలు దించకుండా, కూలీలతో మాత్రమే ఇసుక తవ్వకాలు చేపట్టాలి. ఇక్కడ అంతా నిబంధనలకు విరుద్ధంగా జరుగుతోంది. నదిలో పొక్లెయిన్‌లు దించి నదికి అడ్డంగా గ్రావెల్, ఇసుక పోగులతో రోడ్డు వేశారు. నది నీటి ప్రవాహాన్ని గుత్తావెల్లి వైపు మరలించారు. నదిలో విస్తీర్ణాన్ని దాటి భారీ పొక్లెయిన్లతో ఇసుక పోగులు వేసి రాత్రిపూట ఇసుక నుఅక్రమంగా తరలిస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే బొబ్బిలి, బాడంగి ఇసుక స్టాక్ పాయింట్లుకు వెళ్తందని బుకా యిస్తున్నారు. అక్రమ కేసులు పెడతామని బెదిరిస్తున్నారు. మరోవైపు రీచ్‌లో ఎక్కడికక్కడే గుంతలు పెట్టేయడంతో నదీ ప్రవాహం తమరాం వైపు మరలే అవకాశం ఉందని, వరదలు వచ్చే సమయంలో ముంపునకు గురవుతుందని గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

తమరాం ఇసుక రీచ్‌ను అక్టోబర్ 16న ప్రారంభించాం. ఇక్కడ ఇసుకను ఉచితంగా ఇవ్వాల్సిందే. ఎవరికీ డబ్బులు ఇవ్వొద్దు. అక్రమ వసూళ్లు చేసే వారిపై చర్యలు తీసుకుంటాం. రెండురోజులుగా ఇసుకరీచ్ వద్ద వేతనదారుల సమస్య వచ్చింది. సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం.

– బి.సత్యం, తహసీల్దార్, సంతకవిటి

క్లుప్తంగా

'గురజాడ' విజేతలు వీరే...



విజేతలైన విద్యార్థులతో గురజాడ సాంస్కృతిక సమాఖ్య ప్రతినిధులు

విజయనగరం టౌన్: మహాకవి గురజాడ వర్ధంతిని పురస్కరించుకుని గురజాడ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం గురజాడ స్వగృహంలో విద్యార్థులకు వక్తృత్వం పోటీలు ఫైనల్స్ నిర్వహించారు. గత నెల 28న ప్రాథమిక పోటీల్లో ఎంపిక చేసిన 18 మంది విద్యార్థులకు ఫైనల్స్ నిర్వహించారు. లక్ష్మీప్రసన్న, దివ్యవర్షిణి, ఎస్.జ్యోతి వరుసగా తొలి మూడు స్థానాల్లో నిలిచారు. ఆకాశవాణి, దీపశ్రీ కన్సోలేషన్ బహుమతులను గెలుచుకోగా, కె.శరణ్య ప్రత్యేక బహుమతిని గెలుచుకుంది. న్యాయ నిర్ణేతలుగా సాహితీవేత్త డాక్టర్ ఎ.గోపాలరావు, కవి, విమర్శకుడు కిలపర్తి దాలినాయుడు వ్యవహరించారు. సమాఖ్య ప్రధాన కార్యదర్శి కాపుగంటి ప్రకాష్, డాక్టర్ జక్కు రామకృష్ణ, గురజాడ ఇందిర, భోగరాజు సూర్యలక్ష్మి, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి



మృతి చెందిన ఇప్పిలి అప్పలరాజు

పార్వతీపురం టౌన్: రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన పార్వతీపురం పట్టణ రైల్వేస్టేషన్ సమీపంలో శనివారం చోటు చేసుకుంది. జీఆర్‌పీ ఇన్‌చార్జి తెలిపిన వివరాలు... బలిజిపేట మండలం నారాయణపురం గ్రామానికి చెందిన ఇప్పిలి అప్పలరాజు(64) కూనేరు సంతకు వెళ్లేందుకు పట్టాలు దాటుతుండగా ప్రమాదం జరిగి ఉంటుందని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించామని, కేసు దర్యాప్తు చేపడతామని తెలిపారు.

యువకుడి ఆత్మహత్య



రైలు ట్రాక్ పక్కన శివ మృతదేహం


పార్వతీపురం టౌన్: తల్లిదండ్రులు మందలించారని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పార్వతీపురం టౌన్ రైల్వేస్టేషన్ సమీపంలో శనివారం చోటు చేసుకుంది. జీఆర్‌పీ ఇన్‌చార్జి రత్నాకర్ తెలిపిన వివరాలు... వీరఘట్టం మండలం తూడి గ్రామానికి చెందిన కొనిశ శివ(27) తల్లిదండ్రులు మందలించారని మనస్తాపానికి గురై రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్టు ప్రాథమికంగా నిర్ధారించామన్నారు. మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రికి తరలించినట్టు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

విజయనగరం క్రైమ్: పురుగుల మందు తాగి వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. దీనికి సంబంధించి శనివారం రూరల్ పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. విశాఖ జిల్లా పద్మనాభ మండలం సత్యన్నారాయణపురం గ్రామానికి చెందిన రౌతు నారాయణ (35) అప్పుల బాధలు తాళలేక శుక్రవారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో చాకలిపేట లేఅవుట్‌లో పురుగుల మందు సేవించాడు. పరిస్థితిని గమనించిన స్థానికులు 108 సాయంతో జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ నారాయణ శనివారం మృతి చెందాడు. మృతుని భార్య ఆదిలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్‌ఐ అశోక్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దత్తత తర్వాత కూడా పర్యవేక్షణ చేయాలి

- జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి విజయకల్యాణి



శిశుగృహలో శిశువును పరిశీలిస్తున్న విజయకల్యాణి

విజయనగరం ఫోర్ట్: పిల్లలను దత్తత ఇచ్చిన తర్వాత కూడా వారిని దత్తత తీసుకున్న తల్లిదండ్రులు ఏ విధంగా చూసుకుంటున్నారో.. పర్యవేక్షణ చేయాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి కె.విజయకల్యాణి అన్నారు. స్థానిక కె.ఎల్.పురంలో ఉన్న శిశుగృహను శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసారు. దత్తత ప్రక్రియ గురించి అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు ఎటువంటి ఆహారాన్ని ఇస్తారని అడిగి తెలుసుకున్నారు. దత్తత తీసుకున్న పిల్లలను ఎవరైనా బెగ్గింగ్ వంటి వాటికి వినియోగిస్తున్నారా.. అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. శిశుగృహ మేనేజర్ జి.త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹130	₹230	₹240

గాడి తప్పిన గ్రామ స్వరాజ్యం

రాష్ట్రంలో జగనన్న ప్రభుత్వం నిర్మించిన గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని కూటమి ప్రభుత్వం క్రమంగా నిర్వీర్యం చేస్తోంది. ఇప్పటికే వలంటీర్ వ్యవస్థ లేకుండా చేసిన కూటమి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను కూడా నీరుగార్చేలా చేస్తోంది. సచివాలయ ఉద్యోగులను కేవలం పింఛన్ల పంపిణీకే పరిమితం చేసి వ్యవస్థను దెబ్బతీసేలా వ్యవహరిస్తోంది. దీంతో గ్రామ స్వరాజ్యం గాడి తప్పి పాలన అస్తవ్యస్తంగా తయారవుతోంది.

- పాలన అస్తవ్యస్తం – నిర్వీర్యమవుతున్న సచివాలయ వ్యవస్థ
- గతంలో అందుబాటులో 545 సేవలు
- నేడు గందరగోళం
- పింఛన్‌కు పరిమితమైన సచివాలయ ఉద్యోగులు
- ప్రభుత్వ సేవలందక గ్రామీణుల అవస్థలు



రామభద్రపురంలో ఏర్పాటు చేసిన సచివాలయం - 2, రైతు సేవా కేంద్రం

రామభద్రపురం : గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపనకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేసింది. ఇందులో భాగంగానే సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేసింది. తద్వారా ప్రభుత్వ పాలనను ప్రజల చెంతకు చేర్చింది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ వ్యవస్థలకు తూట్లు పొడిచి పక్కాగా నిర్వీర్యం చేస్తోంది. ప్రభుత్వ సేవలు ప్రజలకు చేరువ చేసేందుకు ఈ వ్యవస్థలు ఎంతగానో దోహదపడ్డాయి. ప్రజలకు చేరువయ్యాయి. గ్రామాల్లో ప్రజలకు ఏ పని కావాలన్నా సచివాలయ వ్యవస్థ ద్వారా వలంటీరే చేసి పెట్టేవాడు. ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు చేరేవి. ప్రస్తుతం కూటమి పాలనలో ఆ పరిస్థితి లేకుండా పోయింది. జగనన్న పాలనలో జిల్లాలో 626 సచివాలయాలు ఏర్పాటు చేసింది. వీటి పరిధిలో 510 రైతు సేవా కేంద్రాలు ఏర్పాటు చేశారు. సచివాలయాల ద్వారా 545 సేవలు ప్రజలకు అందేవి. నేడు ఆ పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. పాలనంతా గందరగోళంగా తయారైంది. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలైనా రేషన్ కార్డులు, కొత్త పింఛన్లు, ఆరోగ్యశ్రీ కార్డుల వెబ్‌సైట్లు ఇంతవరకు తెరుచుకోలేదు. ఫలితంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

నాడు కళకళ. నేడు వెలవెల..

గత ప్రభుత్వం రెండు వేల జనాభా ఉన్న గ్రామంలో రూ.40 లక్షలతో సచివాలయం, రూ.21 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.20.80 లక్షలతో హెల్త్ సెంటర్ ఏర్పాటు చేసింది. కొన్ని నెలల క్రితం వరకు వివిధ సంక్షేమ పథకాల అమలుతో ప్రజలు.. లబ్ధిదారుల రాకపోకలతో కళకళలాడిన సచివాలయాలు నేడు వెలవెలబోతున్నాయి. నేటికీ ప్రభుత్వ వెబ్‌సైట్లు తెరుచుకోకపోవడంతో నూతన పింఛన్లు, రేషన్‌కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకోవడానికి అర్హత ఉన్న లబ్ధిదారులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టు కాళ్లరిగేలా తిరుగుతున్నారు. పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు గ్రామాల్లోని సచివాలయాలకు రోజూ పదుల సంఖ్యలో అర్హులు వెళ్తున్నారు. నూతన పెన్షన్ల కోసం ప్రభుత్వ వెబ్‌సైట్ తెరవకపోవడంతో నిరాశగా వెనుదిరగాల్సి వస్తోంది. దీంతో పింఛన్లు ఎప్పుడు ఇస్తారో తెలియక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేయడంతో సేవలందక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. మరో వైపు సచివాలయ ఉద్యోగులకు పనిలేక ఖాళీగా ఉండాల్సిన పరిస్థితి. సచివాలయ ఉద్యోగులు ప్రస్తుతం ప్రతి నెలా ఒకటో తేదీన పింఛన్ల పంపిణీకే పరిమితమైపోయారు.

రెండు వారాల్లో ఓపెన్ అవుతాయని సమాచారం

సచివాలయాల్లో పింఛన్లు, రేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డుల కోసం దరఖాస్తుకు వెబ్‌సైట్లు ఇంకా ఓపెన్ కాలేదు. ప్రభుత్వం నూతన నియమ నిబంధనలు తయారు చేస్తోంది. ఈ నెల రెండో వారంలో వెబ్‌సైట్లు ఓపెన్ అవుతాయనే సమాచారం ఉంది. ప్రభుత్వం దరఖాస్తుకు అనుమతి ఇచ్చినప్పుడు వెంటనే అమలయ్యేలా చూస్తాం. సచివాలయాల ఉద్యోగుల వినియోగంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది.

– ఎం.కిరణ్‌కుమార్, డీఎల్‌డీఓ, బొబ్బిలి డివిజన్

సచివాలయ ఉద్యోగులే దిక్కు..

కూటమి నేతలు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సచివాలయ ఉద్యోగుల పట్ల వివక్షతో అనేక విమర్శలు చేశారు. అవమానంగా మాట్లాడారు. నేడు కూటమి సర్కార్‌కు పింఛన్ల పంపిణీకి సచివాలయ ఉద్యోగులే పెద్దదిక్కయ్యారు. ఇటీవల కూటమి ప్రభుత్వం చేపట్టిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో స్టిక్కర్లు అతికించే దగ్గర నుంచి ఇంటింట ప్రచారం వరకు వీరినే ఉపయోగించి వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారు. గతంలో ఒకటో తేదీన వలంటీర్లు ఇంటి వద్దనే పింఛన్లు పంపిణీ చేసేవారు. కూటమి ప్రభుత్వం వారిని పక్కనపెట్టి సచివాలయ ఉద్యోగులతో పంపిణీ చేయిస్తోంది. వీరు ఒకటో తేదీన 95 శాతం పైగా పింఛన్లు పంపిణీ చేశామని గొప్పలు చెప్పడం వెనుక సచివాలయ ఉద్యోగుల పాత్ర ఎంత కీలకం అనేది జగమెరిగిన సత్యం.

పశువుల అక్రమ రవాణాను సహించేది లేదు..

- పశు సంవర్ధక శాఖ జేడీ రమణ



సంతలో పశువులు కుండీలను పరిశీలిస్తున్న జేడీ వైవీ రమణ

దత్తిరాజేరు: జిల్లాలో పశువుల అక్రమ రవాణాకు ఎవరికీ ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని, అలా చేస్తే ఉపేక్షించేది లేదని జిల్లా పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ వైవీ రమణ హెచ్చరించారు. పెదమానాపురం పశువైద్యాధికారి దినేష్ ఆధ్వర్యంలో సంతలో పశువుల వ్యాపారులకు రవాణాపై శనివారం అవగాహన కల్పించారు. ఆవులు అక్రమ రవాణా నిలిపివేశామని, చిన్న వ్యాన్లలో రెండు నుంచి మూడు పశువులు, మినీ వ్యాన్లలో నాలుగు నుంచి ఆరు పశువులు మాత్రమే తరలించాలని అన్నారు. అనారోగ్యం పాలైన పశువులను కబేళాలకు తరలించాలని ఏ ఒక్క వ్యాపారికి అనుమతి ఇవ్వలేదని పేర్కొన్నారు. పోలీసు, రెవెన్యూ, మార్కెటింగ్, పంచాయతీ అధికారులు సమావేశానికి గైర్హాజరు కావడంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని జేడీ తెలిపారు. తక్కువ ఆశీలు వసూలు చేసి సంత యజమానులు అన్ని సౌకర్యాలు కల్పించడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. సంతలో సౌకర్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏజేడీ చంద్రశేఖర్, సంత నిర్వాహకులు రామునాయుడు, తిరుపతినాయుడు, గోవింద్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా విక్రయ దుకాణాలపై కొనసాగుతున్న తనిఖీలు



బాణసంచా విక్రయ దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న లీగల్ మెట్రాలజీ విభాగం ఇన్‌స్పెక్టర్ దామోదరనాయుడు

విజయనగరం: జిల్లా కేంద్రంలో గల కెఎల్.పురం ప్రాంతంలో ఉన్న పలు హోల్‌సేల్ బాణసంచా విక్రయ దుకాణాలపై లీగల్ మెట్రాలజీ అధికారులు శనివారం కూడా తనిఖీలు కొనసాగించారు. దుకాణాల్లో విక్రయాలకు ఉంచిన పలు కంపెనీల ఉత్పత్తులను పరిశీలించారు. కొన్నింట్లో లోపాలున్నట్లు గుర్తించారు. తనిఖీల్లో భాగంగా మూడు షాపులతో పాటు మూడు కంపెనీలపై కేసులు నమోదు చేసి సామగ్రిని సీజ్ చేశారు. ప్యాకెజీలపై తయారీ తేదీలు లేకపోవటం, విక్రయ ధర లేకపోవటం, ప్రత్యేక స్టిక్కర్ అంటించడం, కంపెనీ చిరునామాలు లేనట్లు గుర్తించి సీజ్ చేసినట్లు లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ ఎం.దామోదరనాయుడు తెలిపారు. ఈ సందర్భంగా వ్యాపారస్తులతో ఆయన మాట్లాడుతూ ఇటువంటి లోపాలున్న ఉత్పత్తుల విక్రయానికి ఉంచరాదని సూచించారు. తనిఖీల్లో టెక్నికల్ అసిస్టెంట్ సత్యనారాయణ, నవీన్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో దగ్ధమైన దుకాణాలు



దుకాణాల్లో ఎగసిపడుతున్న మంటలను అదుపు చేస్తున్న స్థానికులు

భామిని: మండల కేంద్రంలో శనివారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో మూడు దుకాణాలు కాలిపోయాయి. ఒక్కసారిగా మంటలు పెద్దెత్తున రావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. కాలనీలో ఉన్న దుకాణ సముదాయంలో ఓ దుకాణంలో వెలిగించిన దీపం అక్కడి డోర్‌కర్టెన్‌కు అంటుకొని మంటలు రేగాయని భావిస్తున్నారు. మంటలు క్షణాల్లోనే పక్క దుకాణాలకు వ్యాపించడంతో స్థానికులు చేరుకొని మంటలను అదుపు చేశారు. పెద్దెత్తున మంటలు చెలరేగడానికి దుకాణాల్లో ఉన్న డీజిల్, పెట్రోల్ బాటిళ్లు కారణమని భావిస్తున్నారు. ప్రమాదంలో దుకాణాల్లోని ప్లంబింగ్ సామగ్రి, స్పేరు పార్టులు కాలిపోయాయి. మూడు దుకాణాల్లో రెండు పూర్తిగా కాలిపోగా, ఒక దుకాణంలో పాక్షికంగా కాలిపోయింది. దుకాణాల ముందున్న వ్యాన్ కూడా పాక్షికంగా కాలిపోయింది. సమీపంలోనే విద్యుత్ వైర్లు ఉండడంతో షార్ట్ సర్క్యూట్‌కు గురై మూడు ఇళ్లల్లోని విలువైన ఎలక్ట్రానిక్ పరికరాలు కూడా దగ్ధమయ్యాయి. రూ.లక్షల్లో ఆస్తి నష్టం ఉంటుందని బాధిత కుటుంబాలు వారు విలపిస్తూ చెప్పారు.

6 నుంచి దృష్టిలోప నిర్ధారణ పరీక్షలు



రూరల్ పోలీస్‌స్టేషన్ సమీపంలో పరిసరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: జిల్లాలో కంటి వెలుగు కింద చేపడుతున్న దృష్టి లోప నిర్ధారణ పరీక్షలను ఈ నెల 6 నుంచి నిర్వహించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. కంటివెలుగు కార్యక్రమం నిర్వహణపై ఎంపీడీఓలతో తన కార్యాలయ సమావేశ మందిరంలో కలెక్టర్ శనివారం సమీక్షించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ రూపొందించిన ముందస్తు ప్రణాళికలలో భాగంగా ముందుగా సీతంపేట, గుమలక్ష్మీపురం, సాలూరు, పాచిపెంట, జియమ్మవలస, కొమరాడ మండలాల్లో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని సచివాలయాల్లో నవంబర్ 6 నుంచి వచ్చే ఏడాది జనవరి 20 వరకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతీ గ్రామంలోని 15 ఏళ్ల దాటిన వారందరికీ వైద్యులు కంటి పరీక్షలను నిర్వహించి, వారికి అవసరమైన సూచనలు చేయడంతో పాటు అవసరమైతే శస్త్రచికిత్సలు కూడా చేపట్టాలన్నారు. ఒక్కో సచివాలయం నుంచి కనీసం రోజుకు 20 మంది పరీక్షలకు హాజరయ్యేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. వైద్య ఆరోగ్య శాఖ నోడల్ అధికారి డా.ఎం.వినోద్, ఎంపీడీఓలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ప్రాంతం పరిశుభ్రం కావాలి

పార్వతీపురం టౌన్: పట్టణంలో ప్రతి ప్రాంతంలో పరిశుభ్రమైన వాతావరణం నెలకొనాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. 'స్వచ్ఛ సుందర పార్వతీపురం' కార్యక్రమంలో భాగంగా శనివారం పలు ప్రాంతాల్లో కలెక్టర్ పర్యటించారు. రూరల్ పోలీస్‌స్టేషన్, దుర్గమ్మ గుడి తదితర ప్రాంతాల్లో ముందుగా ఆహ్లాదకర వాతావరణం నెలకొనాలని ఆయన పేర్కొన్నారు. కార్యాలయాల వద్ద ఖాళీగా ఉన్న ప్రదేశాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టి సుందరంగా తీర్చిదిద్దాలని ఆయన చెప్పారు. ప్రతీ కార్యాలయంలో మరుగుదొడ్లు, పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. స్వచ్ఛ సుందర పార్వతీపురం కార్యక్రమంలో ప్రతి పౌరుడు భాగస్వామ్యం కావాలని విజ్ఞప్తి చేశారు. పలు ముఖ్య కూడళ్లలో అందమైన ఆకృతులను ఏర్పాటు చేసి పట్టణానికి మరింత శోభను చేకూర్చాలని అన్నారు. మున్సిపల్ డీఈ జట్టు పారి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

జోనల్ యూనివర్సిటీ పోటీలకు సత్య విద్యార్థులు



క్రీడాకారులను అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్ డాక్టర్ శశిభూషణరావు

విజయనగరం అర్బన్: జమ్ముకశ్మీర్‌లో త్వరలో జరగనున్న జోనల్ యూనివర్సిటీ ఫెన్సింగ్ క్రీడలో రాష్ట్రం నుంచి పాల్గొనే జట్టులో పట్టణానికి చెందిన సత్య డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సాయి దేవమణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో జరిగిన ఇంటర్ యూనివర్సిటీ స్థాయి ఫెన్సింగ్ మహిళా విభాగం పోటీలలో ఎండీవీ శ్రీరూప్య, పురుషుల విభాగంలో కె.పవన్‌కుమార్ పతకాలు సాధించి జోనల్ స్థాయి యూనివర్సిటీ పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. చెన్నైలో జరిగే జోనల్ యూనివర్సిటీ కబడ్డీ బాలికల విభాగం పోటీలకు ఎం.శ్రీవల్లి, ఎల్.వరలక్ష్మి ఎంపికయ్యారని పేర్కొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు పలువురి ఎంపిక



సంతకవిటి: పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయ సిబ్బంది

వంగర: రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలకు పలువురు విద్యార్థులు ఎంపికయ్యారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు కొమరాపు చందు, బొడ్రోతు సొమ్యులు ఎంపికైన వారిలో ఉన్నారని ప్రధానోపాధ్యాయురాలు ముద్దాడ రమణమ్మ శనివారం తెలిపారు. వీరంతా ఈ నెల 3, 4వ తేదీల్లో శ్రీకాకుళంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆమె పేర్కొన్నారు. సదరు విద్యార్థులను పాఠశాల సిబ్బంది అభినందించారు.

సంతకవిటి: మండలంలోని సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఆర్.స్వాతి, జి.గంగోత్రి, బి.జ్యోత్స్నలు రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలకు ఎంపికయ్యారని, వీరంతా శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని ప్రధానోపాధ్యాయుడు వి.వెంకటరావు శనివారం తెలిపారు.



వంగర: విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది

చి'వరి'లో ఇదేం తీరు..!

- నీరు విడిచిపెట్టలేక... రెంచ్ కీ దాచేసిన అధికారులు!
- రైతులకు బ్లాక్ మెయిల్..
- సొంత డబ్బులతో రెంచ్ కీ తయారు చేసిన రైతులు
- ఇంతలో పోయిన పాత కీ తెచ్చి నీరులేదని చెప్పేసిన అధికారులు



16 ఎల్ కాలువ ఆయకట్టులో చివరి తడి అందక ఎండిపోయిన వరి పంట



పోయిందని చెప్పిన రెంచ్ కీ

రాజాం/సంతకవిటి: ఆరుగాలం శ్రమించి అందరికీ అన్నం పెట్టే రైతన్నకు అండగా ఉండాల్సిన మడ్డువలస ప్రాజెక్టు అధికారులు... ఆవేదనకు గురిచేస్తున్నారు. సాగునీటికోసం అరాటపడుతున్న ఆయకట్టు శివారు భూముల రైతులను ఇబ్బందులు పెడుతున్నారు. సాగునీరు విడిచిపెట్టకుండా రెంచ్ కీ పోయిందంటూ బ్లాక్‌మెయిల్ చేయడం రైతులను ఆవేదనకు గురిచేస్తోంది. వివరాల్లోకి వెళ్తే.. సంతకవిటి మండలం సిరిపురం, బలరాంపేట, శేషాద్రిపురం, శివకాలపేట, జానకీపురం, జీఎస్‌పురం తదితర గ్రామాల పంటపొలాలకు మడ్డువలస 16ఎల్, 15ఆర్, పిల్లకాలువలు ద్వారా మూడువేల ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. ఈ ఏడాది ఖరీఫ్ ఆరంభం నుంచే రైతులకు సాగునీటి కష్టాలు ఎదురయ్యాయి. బావుల నీటితో పంటను కోతదశ వరకూ తీసుకొచ్చారు. చివరి తడిగా మడ్డువలస కాలువ నీటిని అందించాలని వారం రోజుల కిందట కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. అక్కడి నుంచి మడ్డువలస కాలువ అధికారులపై ఒత్తిడి రావడంతో పాటు ఇటు రైతులు నుంచి సాగునీటి ఒత్తిడి అధికమైంది. దీంతో పిల్లకాలువలకు నీటిని తరలించే రెగ్యులేటర్ తలుపులకు సంబంధించిన రెంచ్ కీలు పోయాయని మడ్డువలస కాలువ అధికారులు కొత్త షాకులు చెప్పడం ప్రారంభించారు. రైతులే రెంచ్ కీని తీసుకెళ్లారని ఒకసారి, పోయిందని మరోసారి ఆరోపిస్తూ సాగునీటికోసం అధికారులను ప్రశ్నించిన, కలెక్టర్ కార్యాలయానికి వెళ్లిన రైతులను బ్లాక్‌మెయిల్ చేయడం ప్రారంభించారు. నాలుగు రోజులుగా సాగునీరు విడిచిపెట్టకుండా కాలయాపన చేశారు. రైతులు కొత్త రెంచ్ కీని శనివారం సిద్ధం చేయడంతో అధికారులు పాత రెంచ్ కీ దొరికిందని చెప్పి లష్కర్ దాలినాయుడుతో పంపించారు. చివరకు ప్రాజెక్టులో నీరు లేదని, శివారు ప్రాంతాలకు ఇవ్వలేమని తేల్చిచెప్పారు. దీనిపై ప్రాజెక్టు ఏఈ వెంకట్‌కు రైతులు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో రైతులు మండిపడ్డారు. కావాలనే రైతులను ఇబ్బంది పెడుతున్నారన్నారు. ఇదే విషయాన్ని ఏఈ వెంకట్ వద్ద 'సాక్షి' ప్రస్తావించగా సిరిపురంతో పాటు పరిసర గ్రామాల పంట పొలాలకు సాగునీటిని అందిస్తున్నామని తెలిపారు. శివారు ప్రాంతాలకు కూడా సాగునీరు అందించామని, రైతులు ఉత్తినే ఆరోపిస్తున్నారని, రెంచ్ కీ లేదని ఎవరినీ బ్లాక్ మెయిల్ చేయలేదన్నారు.

ఇబ్బంది పెట్టారు..



సాగునీటి కోసం మా గ్రామ రైతులందరం చాలా ఇబ్బందులు పడ్డాం. ఆరువేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందక ఊటబావుల నీటిపై ఆధారపడ్డాం. కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశాం. దీంతో ప్రాజెక్టు ఏఈ వెంకట్‌తో పాటు లష్కర్‌లు బ్లాక్‌మెయిల్ చేయడం ప్రారంభించారు. నీటిని విడిచిపెట్టే ఉద్దేశం లేక రెంచ్ కీ పాయిందని, రైతులే పట్టుకెళ్లిపోయారని ఆరోపించారు. సకాలంలో సాగునీరు అందక సిరిపురం, బలరాంపేట, శేషాద్రిపురం తదితర గ్రామాల్లోని 3 వేల ఎకరాల్లో వరి పంటకు నష్టం వచ్చింది. దిగుబడి తగ్గిపోయే అవకాశం ఉంది.

– పి.రాంబాబు, రైతు, సిరిపురం